ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ

ఎమ్మెల్యే ఆళ్ల నాని



వృద్ధురాలి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని



గడపగడపకు సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (టూటౌన్): ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చి ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచిందని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం 126వ రోజు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నాని బుధవారం స్థానిక 25వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజలందరికీ అండగా నిలబడ్డామని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేశామన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు నిరాటంకంగా అందించి పేదలకు బాసటగా నిలిచామని వివరించారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి శ్రమిస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు. గత పాలకులు చేయని విధంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెలుతోన్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. అనంతరం నాని ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని వివరించారు. ఈ మేరకు పథకాల బ్రోచర్లను అందజేశారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, కార్పొరేటర్ గుడిపూడి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్ బాబు, గుడిదేశి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేషన్ల చైర్మన్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.60 లక్షల అభివృద్ధి పనులకు ఆమోదం

ఏలూరు 29వ డివిజన్ పరిధిలో సుమారు రూ.60 లక్షల అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్టు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. స్థానిక 29వ డివిజన్ 7, 8 సచివాలయాల పరిధిలో ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై బుధవారం తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో నాని సమీక్షించారు. కుమ్మరిరేవు ప్రాంత ప్రజలకు మెరుగైన వసతులు కల్పన, వారి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజారోగ్యం, పారిశుధ్యం, వీధిలైట్లు, డ్రెయిన్లు తదితర సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను చేయాలని అన్నారు. సమావేశంలో కార్పొరేటర్ సుజిత సన్నీ, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్ ఎన్ సుధీర్ బాబు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నాని



అయ్యప్పకు హారతి సమర్పిస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరంపై కార్తీక మాసం ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతోందని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. బుధవారం స్థానిక 34వ డివిజన్‌లో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజలో ఆయన పాల్గొన్నారు. అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేసి, విశేష హారతులు సమర్పించారు. కార్తీక మాసం సందర్భంగా నగర ప్రజలు భక్తి, తన్మయత్వాలతో ఉన్నారని, కార్తీక మాస పూజలు, శైవక్షేత్రాల్లో ప్రత్యేక అభిషేకాలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ నగరంలో భక్తి భావాన్ని పెంపొదిస్తుండడం ఆహ్వానించదగ్గ పరిణామమని నాని అన్నారు. అయ్యప్ప మాలధారులతో పాటు వివిధ స్వామివార్ల మాలలు ధరించి నిష్టతో దీక్షలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు.

చీరల వేలం ఆదాయం రూ.78,930

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పత్తేబాద నాలుగు గుళ్ల సెంటర్ కనకదుర్గమ్మవారి ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను బుధవారం ఆలయ ప్రాంగణంలో వేలం వేశారు. మొత్తం 330 చీరలకు రూ.78,930 ఆదాయం వచ్చింది. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బీహెచ్ రామనాగశంకర్, ట్రస్టీలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని దేవదాయ శాఖ ఏలూరు డివిజన్ తనిఖీదారు బి.లక్ష్మీనరసింహారావు పర్యవేక్షించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తుడు బుధవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెంకు చెందిన వి.శ్రీనివాస్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాత కుటుంబానికి ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

కోటేశ్వరదుర్గాపురంలో రూ.6 కోట్ల లబ్ధి



వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు

ఏలూరు రూరల్: మండలంలోని కోటేశ్వరదుర్గాపురం గ్రామంలో ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.6 కోట్ల లబ్ధి చేకూరిందని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం కోటేశ్వరదుర్గాపురంలో సర్పంచ్ వర్రీ లక్ష్మీదుర్గ ఆధ్వర్యంలో ఆయన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో శ్రీనివాసరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా గ్రామస్తులు సుమారు రూ.3 కోట్ల లబ్ధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో మరో రూ.3 కోట్ల అభివృద్ధి జరిగిందని వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డిని, అబ్బయ్యచౌదరిని మరోసారి గెలిపించాలని పార్టీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్ కోరారు. లక్ష్మీదుర్గ మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు సంపూర్ణ మద్దతు తెలుపుతామని హామీ ఇచ్చారు. అనంతరం నాయకులు పార్టీ జెండా ఎగరేసి, ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు చేకూరిన పథకాల లబ్ధిని వివరించారు. తొలతు ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ వద్ద సంక్షేమ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. మాదేపల్లి సర్పంచ్ కొరపాటి శ్రీరామ్‌ప్రభుదేవ్, గండి బాలకృష్ణ, ఇన్‌చార్జి కార్యదర్శి రవీంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గ్రామీణ ప్రజలు ఎదుర్కొనే సమస్యలను విశ్లేషించడంతో పాటు వారికి పరిష్కార మార్గాలు కూడా తెలియచేయడమే ఉన్నత్ భారత్ అభియాన్ లక్ష్యమని రీజనల్ కోఆర్డినేటర్ బి.పావని అన్నారు. బుధవారం స్థానిక సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల యూబీఏ సెల్ ఆధ్వర్యంలో ఉన్నత్ భారత్ అభియాన్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువతను భాగస్వాములుగా చేయడానికి కేంద్ర మానవ వనరుల శాఖ ఈ కార్యక్రమాన్ని రూపొందించిందని చెప్పారు. ఇందులో భాగంగా తమ కళాశాల సమీప గ్రామాల అభివృద్ధికి కళాశాల యూబీఏ సెల్ కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ యూబీఏ నోడల్ అధికారి జి.నాగరాజా, సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల మాజీ కరస్పాండెంట్ కె.రామకృష్ణరాజు, యూబీఏ కోఆర్డినేటర్ జి.నిర్మల వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ మ్యాజిక్ శిక్షణ అభినందనీయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న అర్బన్ డీఐ సాంబశివరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హేలాపురి బాలోత్సవం కమిటీ విద్యార్థుల్లో సృజనాత్మకతను, నూతన ప్రయోగాల పట్ల ఆసక్తిని, విజ్ఞాన అభివృద్ధిని పెంచేందుకు సైన్స్ మ్యాజిక్ శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఏలూరు అర్బన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ డి.సాంబశివరావు అన్నారు. స్థానిక ఏఆర్డీజీకే హై స్కూల్‌లో బుధవారం నిర్వహించిన సైన్స్ మ్యాజిక్ శిక్షణా శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శిక్షణ ఆధారంగా విద్యార్థులు సైన్స్ సూత్రాలను ఆకళింపు చేసుకోవాలని సూచించారు. డిసెంబర్ 16, 17 తేదీల్లో సురేష్ చంద్రబహుగుణ పోలీస్ స్కూల్లో జరిగే బాలోత్సవం నాలుగో పిల్లల సంబరాల్లో ఎక్కువ స్కూల్స్ నుంచి విద్యార్థులు పాల్గొనాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన వీజీఎంవీఆర్ కృష్ణారావు మాట్లాడుతూ స్కూల్‌కి సీనియర్స్ క్యాటగిరిలో ఇద్దరు చొప్పున బాలోత్సవంలో మ్యాజిక్ ప్రదర్శన ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.దేవేంద్ర నీళ్ల రంగులు మారడం, నీళ్లతో నిండిన ప్లాస్టిక్ కవర్లో పెన్నులతో గుచ్చినా నీళ్లు కారకపోవడం, పేపర్లు రంగులు మారడం, తెల్ల కాగితంపై అక్షరాలు రావడం, పేపర్ల యాంగిల్స్ ఆధారంగా సైజులు మారడం, గ్లాసులో నీరు ఆవిరి కావడం తదితర విషయాల్లో విద్యార్థులను భాగస్వాములను చేసి మ్యాజిక్ షో నిర్వహించారు. సంబంధిత సైన్స్ సూత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలోత్సవం నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ మ్యాజిక్ షో విద్యార్థులు కూడా చేయవచ్చని అందుకు ఆసక్తి పెంచుకోవాలని కోరారు. వచ్చే వారంలో వివిధ పాఠశాలల్లో స్థానికంగా శిక్షణ ఇచ్చేందుకు జనవిజ్ఞాన వేదిక సహకారంతో ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ కార్యదర్శి కె.శ్రీనివాస్, కమిటీ ఉపాధ్యక్షులు జి.శారద, వి.సురేష్ వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు శిక్షణ పొందారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

ఏలూరు రూరల్ : యూటీఎఫ్ ఏలూరు రూరల్ మండల కార్యవర్గాన్ని బుధవారం ఏలూరులోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఏలూరు రూరల్ మండల యూటీఎఫ్ వార్షిక సమావేశంలో ఎన్నుకున్నట్టు జిల్లా కార్యదర్శి, ఎన్నికల అధికారిగా సంబూరి రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా ఓవీ ధనంజయరావు, అధ్యక్షుడిగా పి.సురేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా పి.శ్రీనివాస్ కుమార్, జి.మాధవిలత, ప్రధానకార్యదర్శిగా షేక్ పూరాఖాన్, కోశాధికారిగా టి.ఆశయ్య, కార్యదర్శులుగా పీవీ జనార్ధనరావు, ఎంవీఎస్ మణి, టీఎన్‌డీవీ ప్రసాద్, బి.ప్రభాకరరావు, వై.చిన్నికృష్ణ, బి.శ్రీనివాసరావు, బాలసుబ్రహ్మణ్యం, పీవీ ప్రసన్నకుమార్, శేషుకుమార్, జిల్లా కౌన్సిలర్లుగా పీవీ నరసింహారావు, ఎల్ కనకదుర్గ, బి.విజయానంద్, ఎన్ రామారావు, కె.శ్యామల ఎన్నికయ్యారని వివరించారు. పరిశీలకులుగా వి.కనకదుర్గ వ్యవహరించగా, జిల్లా అధ్యక్షుడు షేక్ ఆలీ, ప్రధాన కార్యదర్శి ఆర్ రవికుమార్ పాల్గొన్నారని పేర్కొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల వర్తింపు

పెదపాడు: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నట్టు ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. పెదపాడు మండలం కలపర్రు గ్రామంలో బుధవారం నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో రైతు భరోసా, గ్రామ సచివాలయం, హెల్త్ సెంటర్లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించి గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాటుపడుతున్నారని వివరించారు. రాష్ట్రంలోనే అత్యధిక నిధులు, పదవులు నియోజకవర్గంలో అందించిన నాయకుడు అబ్బయ్యచౌదరి అని కొనియాడారు. కలపర్రు గ్రామంలో అబ్బయ్యచౌదరి చేసిన అభివృద్ధిని ప్రజలకు స్థానిక నాయకులు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఎంపీటీసీ కంభాల నాగరాజు, యూత్ నాయకుడు గూడవల్లి కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కలపర్రులో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్



ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజను స్వాగతిస్తున్న సీఐ శివాజీ

ఏలూరు (టూటౌన్): ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ టి.శ్రీపూజా ప్రాక్టికల్ ట్రైనింగ్‌లో భాగంగా బుధవారం స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఆమెకు సీఐ కోమాకుల శివాజీ ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. స్టేషన్ సిబ్బంది నిర్వహించే విధులు, స్టేషన్ రికార్డులు, బాధితుల ఫిర్యాదులు, కేసు నమోదు, దర్యాప్తు విధానం మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రిపూట గస్తీ, ట్రాఫిక్ సమస్యలపై చర్యలు, విద్యాలయాల వద్ద నిర్వహించే ర్యాగింగ్ వ్యతిరేక కార్యక్రమాలు, దొంగతనాలు నివారణకు తీసుకుంటోన్న చర్యలను వివరించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో లాక్‌డ్ హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా సంబంధిత వ్యక్తుల గృహాలు వద్ద సీసీటీవీలను ఏర్పాటు విధానాన్ని తెలియజేశారు. ఏలూరు కంట్రోల్ రూమ్ నుంచి వచ్చే సమాచారం మేరకు త్వరితగతిన బాధితులకు ఐదు నుంచి పది నిముషాల వ్యవధిలో బాధితులకు సాయం చేసేందుకు బ్లూ కోట్స్ సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నట్లు సీఐ శివాజీ ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌కు వివరించారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయుల వినతి



ప్రభుత్వ సలహాదారు సజ్జలకు వినతిపత్రం అందిస్తున్న ఎడ్వర్డ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): 1998 డీఎస్సీలో ఎంపికై మినిమమ్ టైం స్కేల్ పద్ధతిలో నియమితులైన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని 1998 డీఎస్సీ క్వాలిఫైడ్‌ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌లకు బుధవారం తమతమ క్యాంపు కార్యాలయాల్లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వివరాలను ఎడ్వర్డ్ ఏలూరులో పత్రికలకు విడుదల చేశారు. ఎంటీఎస్‌లో నియమితులై కనీసం ఏడాది కూడా ఉద్యోగం చేయకుండానే పదవీ విరమణ చేయాల్సిన పరిస్థితి ఎదరైన వారి పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పొడిగించాలని కోరారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుల జీతాల బకాయిలు వెంటనే విడుదల చేయించాలని పేర్కొన్నారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని సజ్జల హామీ ఇచ్చారని ఎడ్వర్డ్ తెలిపారు. కార్యక్రమంలో పెరికే వరప్రసాద్ ఉన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	34	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	64-72
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	32	కంద	60
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	38
కాకర కాయలు	30-34	కీరా దోస	48
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	90
బీరకాయలు (పందిరి)	40	అల్లం	120
క్యాబేజీ	22	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	46	పాలకూర	10
దొండకాయలు	28	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	45-55	గోంగూర	06
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణి	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	11
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	24
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4822	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న జేసీ లావణ్యవేణి

భీమడోలు: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర విజయవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందని జిల్లా సంయుక్త కార్యదర్శి బి.లావణ్యవేణి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై వివిధ శాఖల అధికారులు, సచివాలయాల వలంటీర్లతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ బి.లావణ్యవేణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న వివిధ సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమ విజయవంతానికి గ్రామ, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. జెడ్పీ సీఈఓ సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహణకు మార్గదర్శకాలను వివరించారు. గ్రామస్థాయిలో స్వాగత, సాంస్కృతిక, ఉత్సవ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎస్ఎస్‌కే ఖాజావలి, డీఎల్‌డీఓ లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ పద్మావతి, పశుసంవర్ధక శాఖ జేడీ నెహ్రూబాబు, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న గురున్నాథ్ యాదవ్

భీమడోలు: వచ్చే సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నాయకుడు జి.గురున్నాథ్ యాదవ్ టెక్కలి నుంచి తిరుమల తిరుపతికి చేపట్టిన పాదయాత్ర మంగళవారం రాత్రి భీమడోలు చేరుకుంది. బుధవారం ఉదయం జాతీయ రహదారి మీదుగా ఆయన తన అనుచరులతో కలిసి పాదయాత్ర ప్రారంభించారు. రహదారిపై యాదవ సంఘం నాయకులు, పార్టీ నాయకులు ఆయన్ని కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గురున్నాథ్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ముందుకెళుతున్నట్టు చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలే వైసీపీకి విజయాన్ని అందిస్తారని, పూర్తి నమ్మకం ఉందన్నారు. ఈనెల 8న టెక్కలి నుంచి పాదయాత్ర ప్రారంభమైందని, 1080 కిలో మీటర్ల పాదయాత్ర చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు 480 కిలో మీటర్ల పాదయాత్రను పూర్తి చేశానన్నారు. డిసెంబర్ 3 నాటికి తిరుమల దేవస్థానానికి చేరుకుంటానని చెప్పారు.

గొడౌన్ల వినియోగంపై అవగాహన

పెదవేగి : పంట ఉత్పత్తులను నిల్వ చేసుకుని మంచిధర వచ్చినప్పుడు విక్రయించుకోవడం ద్వారా రైతుకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని జిల్లా సహకార అధికారి (డీసీఓ) డి.మిల్టన్ అన్నారు. పెదవేగి మండలం ముండూరు సొసైటీలో సొసైటీ చైర్మన్ చెరుకూరి ప్రసాదరావు అధ్యక్షతన గొడౌన్ల వినియోగంపై బుధవారం ఏర్పాటుచేసిన రైతుల సమావేశంలో మిల్టన్ మాట్లాడారు. పంట చేతికొచ్చిన సమయంలో గిట్టుబాటుధర లేకపోతే ఆశించిన ధర లభించేదాకా పంట ఉత్పత్తులను సహకార సంఘాల గోడౌన్లలో నిల్వ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. నిల్వ చేసిన పంట ఉత్పత్తుల ధరలో 80 శాతం రుణాన్నీ బ్యాంకుల ద్వారా అందిస్తున్నట్టు చెప్పారు. గొడౌన్లలో పంట నిల్వ చేయడం ద్వారా ఆన్‌లైన్‌లో పంటను విక్రయించుకోవడానికి అవకాశం ఉందన్నారు. డీఆర్ అబ్దుల్ హరి, ప్రోగ్రామ్ డైరెక్టర్ శ్యామ్‌కుమార్, పీడీ సెల్ రీసోర్స్ పర్సన్ సూర్యప్రకాశరావు, రామచంద్రరావుపేట బ్రాంచ్ సూపర్వైజర్ పణీంద్ర, ముండూరు సొసైటీ కార్యదర్శి ప్రసాదరావు, సొసైటీ డైరెక్టర్స్ ముత్యాల గణపతి, కొలుకులూరి చిన నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.